RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం , అక్టోబర్ 13 , 2026

# హెచ్ఎంఎస్ కార్పొరేట్ నూతన కమిటీ ఎన్నిక

- కొత్త కమిటీ సభ్యులను ఎక్స్‌ప్లోరేషన్ జీఎంకు పరిచయం చేసిన రియాజ్





**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి):** హెచ్ఎంఎస్ కార్పొరేట్ ఏరియా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ మహమ్మద్ సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీలో జాయింట్ సెక్రటరీగా దేవగుప్తపు శ్రీనివాస్, కార్పొరేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాండ్ర రాయమల్లును నియమిస్తూ రియాజ్ అహ్మద్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేట్ ఏరియాకు చెందిన పలువురు కార్మికులు హెచ్ఎంఎస్‌లో చేరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎక్స్‌ప్లోరేషన్ ఏజీఎంకు పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కరుణాకర్, వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, కార్పొరేట్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ రవి, మెయిన్ హాస్పిటల్ ఫిట్ సెక్రటరీ కిరణ్‌తో పాటు హెచ్ఎంఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ఆర్యవైశ్య విద్యార్థులకు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం

- 47 మంది విద్యార్థులకు విద్యా సహాయం.. నిరుపేద యువతికి వివాహ సాయం



**పాల్వంచ, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** శ్రీ వాసవి ఆర్యవైశ్య విద్యా--వివాహ సహాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో 47 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం పాల్వంచలోని వాసవి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్, ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్‌తో పాటు ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సహాయం అందించారు. కొత్తగూడెంకు చెందిన నిరుపేద యువతికి వివాహ సాయం కూడా అందజేశారు. 2012లో చారుగుండ్ల దేవిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల చదువుకు, పేద కుటుంబాల అవసరాలకు అండగా నిలవడమే ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రూ జోన్ క్లీన్ ఎనర్జీ ప్రెసిడెంట్ చారుగుండ్ల భవాని సురేష్, డాక్టర్ తాడికొండ ప్రవీణ్ కుమార్, చాంబర్ కన్వీనర్ చలవాది ప్రకాష్ హాజరయ్యారు. కార్యక్రమానికి వంకదార నరసింహం కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చిల్లంచర్ల గిరిధర్, కోశాధికారి మిట్టపల్లి నరసింహారావు, కార్యనిర్వహణ కార్యదర్శి షేగు జనార్ధన్, పెండ్యాల రోజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

యువతకు కొత్వాల శ్రీనివాసరావు పిలుపు

పాల్వంచలో వరుణ్ స్కేటింగ్ అండ్ కరాటే అకాడమీ ప్రారంభం



**పాల్వంచ, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** యువత క్రీడారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాల్వంచ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణంలోని 45వ డివిజన్ ముజిందర్ ఎస్టేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వరుణ్ స్కేటింగ్ అండ్ కరాటే అకాడమీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ చిన్నారులు, యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో స్కేటింగ్, కరాటే వంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అకాడమీ ఏర్పాటు ద్వారా స్థానిక చిన్నారులు, యువతకు క్రీడల్లో శిక్షణ పొందేందుకు అవకాశం కల్పిస్తున్న డైరెక్టర్ ఏడుకొండలు యాదవ్‌ను ప్రజాప్రతినిధులు అభినందించారు. క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ తడకమల్ల ప్రణీత్, కార్పొరేటర్లు డాక్టర్ బి.ఎస్. రావు, కొత్వాల విమలాదేవి, బానోత్ బాలునాయక్, దంతెబోయిన నరేష్, సీరపు సుగుణ, ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్కేటింగ్ కోచ్ కె. సురేష్, వైద్యులు సునీల్, కిరణ్, ముజిందర్ ఎస్టేట్ యజమాని దీపక్, కరాటే మాస్టర్ డి. వాసు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాల్లో ఆడపడుచుల సందడి

- డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు

- తీరొక్క బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు.. చీరల పంపిణీతో పండుగకు మరింత శోభ



**చుంచుపల్లి, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడపడుచులంతా ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని జనసేన పార్టీ కార్యాలయ ప్రాంగణంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను చేతబూని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో వేడుకలకు తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చారు. మహిళల భాగస్వామ్యంతో జనసేన కార్యాలయ ప్రాంగణం బతుకమ్మ పాటలు, సంబరాలతో కళకళలాడింది. వేడుకలకు హాజరైన మహిళలకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోజుకో పట్టుచీరతో పాటు ఐదు కన్సోలేషన్ చీరలను బతుకమ్మలతో వచ్చిన మహిళలకు అందజేశారు. అనంతరం మహిళలకు, పిల్లలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను చాటడంతో పాటు మహిళల్లో ఐక్యత, ఆత్మీయతను పెంపొందించేందుకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే సంబరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనాలని వారు కోరారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన కార్యాచరణ

- కొత్తగూడెంలో రౌండ్‌టేబుల్ సమావేశం.. ఎన్నికల వ్యూహంపై డాక్టర్ గడల శ్రీనివాసరావు దిశానిర్దేశం

- ఓటర్లను చేరుకునే విధానంపై నాయకులు, కార్యకర్తలకు సూచనలు





**భద్రాద్రి బ్యూరో, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ నాయకత్వం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తగూడెంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రణాళిక, ప్రచార వ్యూహం, పట్టభద్రుల ఓటర్లను చేరుకునే విధానాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లు తనూజ రెడ్డి, వినయ్ విప్లవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రణాళికను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి, పట్టభద్రుల వద్దకు పార్టీ సందేశాన్ని ఎలా తీసుకెళ్లాలి అనే అంశాలపై నాయకులు, కార్యకర్తలకు వివరించారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాల కంటే వారి సమస్యలను తెలుసుకుని, అభ్యర్థి విధానాలు, లక్ష్యాలను స్పష్టంగా వివరించడం ద్వారా మద్దతు కూడగట్టాలని సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో ఎన్నికల కార్యాచరణపై చర్చించి, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలి



- సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన..

- కాంట్రాక్టు కార్మికులకు 20 శాతం వాటా చెల్లించాలని డిమాండ్



**కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)** 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సింగరేణి ప్రధాన కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మిక కుటుంబాలు లాభాల వాటా కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. లాభాల ప్రకటనలో సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల కార్మికుల్లో అసంతృప్తి నెలకొందన్నారు. బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో 20 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీఎం పర్సనల్ ఐఆర్ అండ్ పీఎం కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలి పారు. సింగరేణికి బొగ్గు, విద్యుత్ సరఫరాలకు సంబంధించి ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, ఈ పరిస్థితి సంస్థ ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతోందని నాయకులు పేర్కొన్నారు. బకాయిల వసూలు, కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు రమేష్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి రమేష్ బాబు, గడల నరసింహారావు, శ్రీరామ్ మూర్తి, పీవీ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు మాతంగి రాజేష్, జి. సక్రు తదితరులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలి: కొత్వాల



**పాల్వంచ, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** ఎల్ నినో ప్రభావం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాలంలో పండే పంటలు వేసుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం సచివాలయం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్ నినో ప్రభావంపై రైతులకు సూచనలు చేశారు. జగన్నాథపురం రైతు వేదికలో దీన్ని వీక్షించిన అనంతరం కొత్వాల మాట్లాడుతూ విద్యుత్ వాడకం పెరిగి ఉత్పత్తి తగ్గినందున డిసెంబర్ నుంచి ప్రభావం మరింత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారని, రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటలు ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో శంభోశంకర్, ఏఈవోలు కోటేశ్వరరావు, సత్యం, విశాల, పవన్, లైన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఆర్చరీలో ఖమ్మం జిల్లా ఆర్చర్ల జయభేరి

- మూడు స్వర్ణావకాశాల దిశగా ప్రతిభ.. నలుగురు క్రీడాకారులకు జాతీయ పోటీలకు అర్హత



**చుంచుపల్లి, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** రాష్ట్రస్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లోని బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందారు.ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో కె. లక్ష్మణ్ ప్రథమ స్థానం, కె. రామ్‌చరణ్ ద్వితీయ స్థానం, కె. సర్వేష్ తృతీయ స్థానం సాధించారు. రికర్వ్ మహిళల విభాగంలో కె. లోహిత శ్రీ ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు.ఈ విజయాలతో నలుగురు క్రీడాకారులు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత సాధించారు. జాతీయస్థాయిలోనూ రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. విజేతలను ఖమ్మం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి టి. సునీల్ కుమార్, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు సాధుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి పుట్టా శంకరయ్య అభినందించారు. క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



# కాంగ్రెస్ ఎంపీ దిష్టిబొమ్మ దహనం

- అంగోమ్చ భీమల్ అకోజైమ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి



**కొత్తగూడెం, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)** మణిపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చ భీమల్ అకోజైమ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ.. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ ఎంపీపై వచ్చిన ఆరోపణలు ఆందోళనకరమని అన్నారు. ప్రజాప్రతినిధిగా, విద్యావేత్తగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం విచారకరమని పేర్కొన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, పార్టీ పరంగా కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత గు రించి మాట్లాడే కాంగ్రెస్ నాయ కత్వం, తమ పార్టీ ఎంపీపై వచ్చిన ఆరోపణల విషయంలో స్పందించాలని అన్నారు. బా ధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వ ర్యంలో ఆందోళన లు కొనసాగి స్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు, మూడో డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ముువ్వ అపర్ణ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆకునూరి పద్మ, మహిళా మోర్చా ఐటీ కన్వీనర్ పోలే మనశ్విని, అధికార ప్రతినిధి భోగాలక్ష్మి, కార్యవర్గ సభ్యురాలు కుసుమ భవాని, సోను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
మంగళవారం , అక్టోబర్ 13 , 2026

# ప్రభుత్వ వైఫల్యాలే మా అస్త్రాలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి గెలుపు ఖాయం**

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సంకుబాపన అనుదీప్**









**భద్రాద్రి బ్యూరో, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)**

ఉమ్మడి నల్గొండ – వరంగల్ – ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఎన్నికలను బిఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి గెలుపును కాంక్షిస్తు భద్రాద్రి జిల్లా నాయకులు సంకుబాపన అనుదిప్ ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టభద్రులు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగస్తులను కలిసి రాకేష్ రెడ్డి కి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వాణి ప్రతినిధితో ఆయన మాట్లాడుతు అమలు చేయలేని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ నేడు ప్రజలను మోసం చేస్తూ కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనే అస్త్రంగా మార్చుకుని ముందుకు వెళ్తున్న తమకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఖాయమని రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ జిల్లా నాయకులు సంకుబాపన అనుదిప్ అన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకే జిల్లా కేంద్రంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పట్టభద్రులందరూ 'ఫామ్ 18' నింపి ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యువత, ఉద్యోగులకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించిన ఆయన పెండింగ్ లో ఉన్న డీఏల బకాయిలు, పీఆర్సీ, ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, జీతాల చెల్లింపుల వంటి అనేక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి గురించి ప్రతి ఒక్కరికి తెలుసని ఆయన గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై పోరాటం సాగిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత, ఉద్యోగుల కష్టాలు, ప్రజల సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు అందరికి తెలుసని, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పట్టభద్రులు ఈసారి రాకేష్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తారని అనుదిప్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

**- ఈ నెల 15వ తేదీ లోపు లాభాల వాటా ప్రకటించే అవకాశం**

**- ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్**



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)**

సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం, యాజమాన్యంతో జరిపిన చర్చల్లో కీలక పురోగతి లభించిందని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్టియుసి తెలిపింది. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవ రెడ్డి నాయకత్వంలో, సెక్రటరీ జనరల్ డాక్టర్ బి.జనక్ ప్రసాద్ ప్రభుత్వంతో, యాజమాన్యంతో పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ పేర్కొన్నారు. సోమవారం రుద్రంపూర్ లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని చర్చల సారాంశాన్ని వివరించారు. అయితే చర్చల్లో ప్రస్తావించిన ప్రధానాంశాలు,

సింగరేణి లాభాల వాటా ఈ నెల 15వ తేదీలోపు లాభాల వాటాను ప్రకటించి, కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని, అలాగే మెడికల్ బోర్డుల నిర్వహణ ప్రతి నెలా ఆయా ఏరియా ఆసుపత్రుల్లో మెడికల్ బోర్డులు నిర్వహించి, అర్హులైన కార్మికులకు మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచనప్రాయంగా అంగీకరించినట్లు తెలిపారు. కార్మికుల సొంత ఇంటి పథకం ఎన్నికల హామీల్లో ప్రధానమైన కార్మికుల సొంత ఇంటి పథకాన్ని త్వరలోనేప్రారంభించేదిశగాసన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పెర్క్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, కోల్ ఇండియా తరహాలోనే సింగరేణి కార్మికుల పెర్క్‌పై ఆదాయపు పన్ను (ఇన్కమ్ టాక్స్) మినహాయింపు కల్పించే అంశంపై ఈ ఏడాది లోనే నిర్ణయం తీసుకునేలా కృషి చేయనున్నారని తెలిపారు

అలియాస్ పేర్ల సమస్య,ఇప్పటికే కమిటీ సమావేశం జరిగిన నేపథ్యంలో, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా మానవీయ కోణంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారని వివరించారు. పెండింగ్ కోర్టు, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న కోర్టు, విజిలెన్స్ కేసులను సమీక్షించి సాధ్యమైనంత వరకు మానవీయ దృక్పథంతో పరిష్కరించనున్నారని తెలిపారు. అలాగే కొవిడ్ సమయంలో డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించనున్నారు.

కొత్త బొగ్గు గనుల కేటాయింపు: సంస్థ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సింగరేణికి కొత్త బొగ్గు గనులను కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరడమైనది.

**జెన్‌కో, ట్రాన్స్‌కో బకాయిలు**

టీఎస్ జెన్‌కో ( టీఎస్ జెన్కో), ట్రాన్స్‌కో (ట్రాన్సకో )ల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. సింగరేణి విస్తరణ, అనుబంధ పరిశ్రమలు, బొగ్గు ఉత్పత్తితో పాటు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసి, సంస్థ ఆదాయాన్ని పెంచుతూ నిరుద్యోగులకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారని తెలిపారు. గనుల్లో అవసరమైన సామగ్రిని వివిధ గనుల్లో డ్రిల్ బిట్స్, రక్షణ సామగ్రి, డంపర్ల స్పేర్ పార్ట్స్ కొరతను అధిగమించేలా వెంటనే పరికరాలను సమకూర్చి ఉత్పత్తి, రక్షణ ప్రమాణాలను మెరుగుపరచాలని ప్రభుత్వానికి విన్నవించారు.

అధికారుల పీఆర్‌పీ అధికారులకు సంబంధించిన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేను త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ నిరంతరం పనిచేస్తుందని యూనియన్ స్పష్టం చేసినట్టు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధినాయకత్వంతో పాటు సింగరేణి యాజమాన్యాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ సెంట్రల్ బ్రాంచ్ నాయకులు, ట్రెజరర్, ఫిట్ కార్యదర్శిలు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు డా. మట్టా దయానంద్ పరామర్శ

**- తల్లాడ మండలంలో పలు గ్రామాల్లో పర్యటన.. మృతుల కుటుంబాలకు సానుభూతి**





**తల్లాడ, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి):**

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నూతనకల్ గ్రామంలో మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న తూము వీరభద్రయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మిట్టపల్లి గ్రామంలో పొట్రూ శ్రీను తండ్రి ప్రకాశరావు దశదిన కర్మ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిట్టపల్లి ఎస్సీ కాలనీలో మాగంటి బలరాం, ఆయన బాబాయి మాగంటి యాలాద్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముద్దునూరు గ్రామంలో తాళ్లూరి అప్పయ్య దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రాచలం రోడ్ పేరును మార్చాలి

**- కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా నామకరణం చేయాలి: ఎమ్మెల్యే కూనంనేని**

**కొత్తగూడెం, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి):**



భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా మార్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు సోమవారం లేఖలు రాశారు. స్టేషన్ కొత్తగూడెం పట్టణంలోనే ఉన్నప్పటికీ భద్రాచలం రోడ్ పేరుతో ప్రయాణికుల్లో గందరగోళం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా పేరును మార్చి, జిల్లా ప్రజల సౌకర్యార్థం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# అమ్మను పూజిస్తే అష్టైశ్వర్యాలు లభిస్తాయి





**పాల్వంచ, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి)**

అమ్మవారు కరుణాస్వరూపిణి అని, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సకల కష్టాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పాల్వంచ పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పలు అమ్మవారి ఆలయాలు, మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు చేసి భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, నూకల సరిత, సింధు తపస్వి, కొత్వాల సత్యనారాయణ, కొండం వెంకన్న, నూకల రంగారావు, శనగ రామచందర్, అశ్విని కుమార్, వై. వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, వనమా సంపత్ కుమార్, బూసి శ్రీను, వంగా రమేష్, మసనం శరత్, కోసూరి కిరణ్, రౌతు మల్లేష్, కరుకుల సతీష్, చిన్న పండు, సంతోష్‌రెడ్డి (బబ్లూ), కంచర్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మోహన్ రావు పటేల్





**నిర్మల్ -బాసర/లోకేశ్వరం/కుంటాల: అక్టోబర్ 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నిర్మల్ జిల్లాలోని బాసర,పాంగ్రి, పుష్పూర్,బూరుగుపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మృతి చెందడంతో ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ ఆయా గ్రామాల్లోని మృతుల కుటుంబాలను పరామర్శించారు.బాసర గ్రామానికి చెందిన కుంధుని దేశపాండే వినయ్ దేశపాండే తల్లి,పాంగ్రి గ్రామానికి చెందిన అనూషాబాయి, పుష్పూర్ గ్రామానికి చెందిన గైని శంకర్,సూర్యవంశీ దేవరావు, కుంటాల మండలం బూరుగుపల్లికి చెందిన లక్ష్మణ్, సురేష్ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# అగ్నికి ఆహుతైన ఇల్లు.. ఆవేదనలో కుటుంబం!

**- షార్ట్‌సర్క్యూట్‌తో రూ.15 లక్షల ఆస్తి నష్టం**

**- ఆసుపత్రిలో తండ్రి.. ఇంట్లో అగ్నిప్రమాదం.. కట్టుబట్టలే మిగిలిన నిరుపేదలు**

**-బాధితులకు అండగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘం**

**-ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు**





**ఎండపల్లి, అక్టోబర్ 12(తెలంగాణ వాణి)**

అనుకోని అగ్నిప్రమాదం ఓ నిరుపేద కుటుంబాన్ని రోడ్డున పడేసింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి కళ్లముందే కష్టపడి సంపాదించుకున్న ఆస్తి మొత్తం బూడిదైంది. ఎండపల్లి మండల కేంద్రంలో ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి--కొమురయ్య దంపతుల నివాస గృహంలో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. బంగారం, వెండి ఆభరణాలు, నగదు, దుస్తులు, విలువైన పత్రాలు సహా ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోవడంతో సుమారు రూ. 15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి చికిత్స కోసం తెచ్చిన డబ్బులూ బూడిదే! బాధితుడు కొమురయ్య తండ్రి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చుల కోసం అప్పు చేసి తెచ్చిన డబ్బులను ఇంట్లోని బీరువాలో భద్రపరిచి, తాళం వేసి కుటుంబ సభ్యులంతా ఆసుపత్రికి వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇల్లు మొత్తం వ్యాపించాయి. గ్రామస్థులు సకాలంలో స్పందించి, పంట పొలాలకు మందులు పిచికారీ చేసే ట్రాక్టర్ ట్యాంకర్ సహాయంతో మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కన్నీరుమున్నీరైన బాధితులు. ఒకవైపు తండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం, మరోవైపు కష్టకాలంలో నిత్యావసరాలు, కట్టుబట్టలతో సహా అంతా కాలిపోవడంతో బాధితురాలు కళ్యాణి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి రోదనలు చూసి గ్రామస్థులు చలించిపోయారు. ప్రమాద వార్త తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకుని అధైర్యపడకూడదని ధైర్యం చెప్పారు.



ఆర్థిక తోడ్పాటు: బాధిత కుటుంబానికి కుల సంఘం తరపున రూ. 50,000, గ్రామ సర్పంచ్ సునీత జెలందర్ రెడ్డి రూ. 25,000 ఆర్థిక సహాయం చేశారు. రెవెన్యూ సిబ్బంది బాధితులకు తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఆర్ఐ అన్వేష్, సెక్రటరీ కొమురయ్య, వీపీఓ ప్రతాప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి

ఇప్పటికే తండ్రి వైద్య ఖర్చుల కోసం అప్పుల భారంతో సతమతమవుతున్న ఉపసర్పంచ్ కళ్యాణి కుటుంబానికి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించి, పునరావాసం కల్పించాలని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# వ్యవసాయ క్లస్టర్ ఏఈఓ పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**హుస్నాబాద్ అక్టోబర్ 12 (తెలంగాణ వాణి ఆర్ సి)**

ఎల్ నినో ప్రభావంతో సరైన వర్షపాతం లేక ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం రాయితీపై వేరుశన విత్తనాలు పంపిణీ చేశారు. ఈ విషయంపై రైతులకు సమాచారం లేదని రైతులు వాపోతున్నారు.పందిళ్ళ, పొట్లపల్లి, కూచనపల్లి, మాలపల్లి గ్రామాల రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీపై వచ్చే విత్తనాలు ఎరువులపై సరైన సమాచారం ఇవ్వకుండా చరవాణిలో అందుబాటులో లేకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఏఈఓ ను తొలగించి మరొకరు నియమించాలని పొట్లపల్లి గ్రామ రైతులు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో రైతులతో సంతకాలు సేకరించి కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సంబంధి శాఖ అధికారులకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్యాంసుందర్ గౌడ్ తెలిపారు.